శరణు శరణు దుర్గాభవానీ

- వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం
- తొలిరోజు బాలా త్రిపుర సుందరీదేవిగా అమ్మవారి దర్శనం


గుడ్లవానిపాలెంలో పూజలు చేస్తున్న భవానీలు


సంతపేట రెడ్డివీధి మండపంలో కొలువుదీరిన దుర్గమ్మ

తగరపువలస: శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం చిట్టివలస కార్మికవాడ, భీమిలి అర్బన్, రూరల్ పరిధిలో వైభవంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారి విగ్రహ తయారీ కేంద్రాల నుంచి బాణసంచా, తీన్‌మార్, మేళతాళాలు, కలశాలు, సారెలతో ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాలతో పల్లకీసేవ నిర్వహించారు. దీంతో అమ్మవారి విగ్రహాలు ఉంచిన ఆలయాల నుంచి మండపాల వరకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు రహదారులు రద్దీగా కనిపించాయి. పలువురు భక్తులు నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా భవానీ మాలధారణ స్వీకరించారు. చిట్టివలస జ్యూట్‌మిల్లు రామాలయంలో అర్చకుడు ఆకెళ్ల రవికుమార్ భక్తులకు భవానీ మాలధారణ చేశారు. అందంగా ముస్తాబు చేసిన మండపాల్లో అమ్మవారి విగ్రహాలు ఉంచి పూజలు చేశారు. బైపాస్‌రోడ్డులోని శ్రీవిజయదుర్గ ఆలయం, సంగివలస కొత్తమ్మవారి ఆలయాల్లో అమ్మవారిని బాల త్రిపుర సుందరీదేవిగా అలంకరించి భక్తులకు వేకువజాము నుంచే దర్శనాలు కల్పించారు. అంబేద్కర్ కూడలిలోని శ్రీదుర్గాభవాని ఆటో సంఘం ఆధ్వర్యంలో అర్చకుడు నేరెళ్ల విశ్వేశ్వరశర్మ వందలాది ఆటోలతో ఊరేగింపుగా అమ్మవారిని మండపం వద్దకు తోడ్కొని వచ్చారు. ఆంధ్రా బ్యాంకు కూడలిలో సోమయాజుల కల్యాణ చక్రవర్తి శర్మ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ మండపంలో అమ్మవార్ల వివిధ రూపాలకు చెందిన 15 విగ్రహాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పల్లకీసేవతో ఉత్సవాలు ప్రారంభించారు. గ్రంథాలయ వీధిలో అమ్మవారిని రథంపై తోడ్కొని వచ్చారు. గణేష్ థియేటర్ కూడలిలో భవానీలు, మహిళలు అమ్మవారికి సారె సమర్పించి ఊరేగింపు నిర్వహించి అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. సంతపేట రెడ్డి వీధి, గొల్లవీధి, ఆదర్శనగర్, చిట్టివలస రెడ్డివీధి, నీళ్ల టాంకు, భీమిలి మండలంలోని మజ్జివలస, చిప్పాడ, తాళ్లవలస, మూలకుద్దు, సిటీనగర్, తాటితూరు, దాకమర్రి పంచాయతీల్లో వందలాది మంది భక్తులు మండపాల వద్ద ఘనంగా ఉత్సవాలు ప్రారంభించారు. దుర్గమ్మ శరణు శరణు అంటూ భీమిలి పరిసరాలు ప్రతిధ్వనించాయి.

సంగివలసలోని తమ నివాసంలో వీఎంఆర్‌డీఏ మాజీ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, వెంకటరావు దంపతులు దుర్గమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తగరపువలస ఆంధ్రా బ్యాంకు వద్ద మండపం, భీమిలి మండలం మజ్జివలసలో అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు.

పద్మనాభం: మండలంలోని మద్ది, రెడ్డిపల్లి, కృష్ణాపురం కాలనీలో నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. మద్ది పైడితల్లమ్మ ఆలయం వద్ద నిలిపిన దేవి విగ్రహానికి ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు బుగత సత్యనారాయణ, బాందేవుపురం కో - ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు బుగత శ్రీనివాసరావు పూజలు చేశారు.

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు జీవీపీ యూత్ ఆధ్వర్యంలో గుడ్లవానిపాలెంలో దుర్గాదేవిని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. ఎండాడ శ్రీదుర్గాదేవి ఆలయంలో, కొమ్మాది శ్రీ అష్టలక్ష్మి దేవాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.

మధురవాడ: మధురవాడలోని ఆలయాలు, నివాస ప్రాంతాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. చంద్రంపాలెం దుర్గాలమ్మ ఆలయం, మానం ఆంజనేయులు నగర్‌లోని శ్రీలలిత త్రిపుర సుందరి సమేత మహా కామేశ్వర స్వామి దేవాలయం, రేవళ్లపాలెం శ్రీభూలోక మాత అమ్మవారి ఆలయం, టైలర్స్ కాలనీలోని శ్రీ విజయదుర్గదేవి ఆలయం, గణేష్‌నగర్‌లోని విజయగణపతి ఆలయంతోపాటు రేవళ్లపాలెం శ్రీసాయిసూర్య రెసిడెన్సీలో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. పిల్లా సూరిబాబు, పి.వి.జి. అప్పారావు, నాగోతి తాతారావు, బంగారు లక్ష్మి, శ్రీనివాసయాదవ్, ధనుంజయ్, పాండ్రంగి అప్పారావు, లక్ష్మి పాల్గొన్నారు.

పీఎం పాలెం : స్థానిక కారుషెడ్ బబ్బేలమ్మ ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. బాలా త్రిపురసుందరి దేవి అవతారంలో దర్శనమిచ్చిన అమ్మవారికి సామూహిక సహస్ర కుంకుమార్చన నిర్వహించారు. లలితా సహస్రనామ పారాయన చేశారు.


బాలా త్రిపురసుందరి అలంకరణలో బబ్బేలమ్మ


తగరపువలస ఆంధ్రాబ్యాంకు వద్ద...


మజ్జివలసలో అమ్మవారు


అంబేద్కర్ కూడలిలో శ్రీదుర్గాభవానీ ఆటో సంఘం ఆధ్వర్యంలో మండపంలో పూజలు


ఆంధ్రా బ్యాంకు కూడలిలో కల్యాణచక్రవర్తి శర్మ ఆధ్వర్యంలో పల్లకీసేవ


చంద్రంపాలెం దుర్గాలమ్మ ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు


దుర్గాదేవి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న ఎంపీపీ రాంబాబు

క్లుప్తంగా

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరే కృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

రోడ్డు విస్తరణ పనుల పరిశీలన


రోడ్డు విస్తరణ పనులు పరిశీలిస్తున్న నాయకులు


పద్మనాభం: పద్మనాభం కన్నయ్య కోనేరు నుంచి రెడ్డిపల్లి శాంతినికేతన్ వరకు ఎన్‌డీబీ నిధులు రూ.10.04 కోట్లతో ఆర్‌అండ్‌బీ రోడ్డు విస్తరిస్తున్నారు. 12 అడుగుల వెడల్పున్న రోడ్డును 24 అడుగుల మేర విస్తరిస్తున్నారు. ఈ పనులను ఎంపీపీ కంటుబోతు రాంబాబు, జెడ్పీటీసీ సభ్యుడు సుంకర గిరిబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు ఆదివారం పరిశీలించారు.

రూనీస్‌కి రైతునేస్తం పురస్కారం


మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు నుంచి పురస్కారం అందుకుంటున్న రూనీస్

మధురవాడ: మధురవాడకు చెందిన టెర్రస్ గార్డెనర్ బంగారు రూనీస్ మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతుల మీదుగా రైతునేస్తం పురస్కారాన్ని అందుకున్నారు. శనివారం రాత్రి విజయవాడలో స్వర్ణ భారతి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఆమెకు పురస్కారాన్ని అందించారు. సేంద్రియ పద్ధతుల్లో టెర్రస్ గార్డెన్ నిర్వహణపై పలువురికి సూచనలు, సలహాలు ఇచ్చి పట్టణ ప్రాంతాల్లో పచ్చదనం పెంపొందించేందుకు చేసిన కృషికి ఈ పురస్కారం లభించిందని ఆమె తెలిపారు.

ఉచిత యోగా శిక్షణ ప్రారంభం


చిన్నారులకు యోగాలో శిక్షణ ఇస్తున్న రమేష్

తగరపువలస: భీమిలి మండలం గొల్లల తాళ్లవలసలోని భరోసా లిటిల్ హగ్స్ బాలల సంరక్షణ కేంద్రంలో చిన్నారులకు ఆదివారం ఉదయం ఉచిత యోగా శిక్షణ ప్రారంభించారు. ఓం ఉచిత యోగా సంస్థ అధ్యక్షుడు చిలకా వెంకటరమేష్ శిక్షణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాతో ఆరోగ్యం, క్రమశిక్షణ, ప్రశాంతత చేకూరుతుందన్నారు. అనంతరం రమేష్‌ను సంరక్షణ కేంద్రం అధ్యక్షుడు అత్తాడ అవినాష్, వెంపాడ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు వెంపాడ శ్రీనివాస రెడ్డి, చిన్నారులు సన్మానించారు.

పేదరిక నిర్మూలనే లక్ష్యం


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు


లబ్ధిదారులకు పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

కొమ్మాది: పేదరికం నిర్మూలనే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్ దరి వివేకానందనగర్‌లో ఆదివారం ఉదయం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి పథకాలు అందుతున్నాయా..? లేదా..? అని ప్రతి కుటుంబాన్ని ఆరా తీసి వారి సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల లక్ష్యాలను వివరించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో అవినీతి, సిఫార్సులకు తావు లేకుండా, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ పారదర్శకంగా పథకాలు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందని కొనియాడారు. మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని తెలిపారు. అధిక శాతం పథకాల నగదు మహిళల ఖాతాల్లోనే జమ చేస్తున్నారని, పేదరికం కారణంగా ఏ ఒక్కరూ చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశ్యంతో పిల్లలను బడికి పంపించే తల్లులకు అమ్మఒడి పథకంలో భాగంగా రూ.15 వేలు అందిస్తున్నామని తెలిపారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

వివేకానందనగర్‌లో రూ.32 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. జీవీఎంసీ నుంచి నిధులు విడుదలయ్యాయని, పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని సూచించారు. కార్యక్రమాల్లో జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి, కార్పొరేటర్ లొడగల అప్పారావు, వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు గుడ్ల పోలిరెడ్డి, సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యురాలు రాజేశ్వరి, స్థానిక నాయకులు లొడగల రామ్మోహన్, అల్లాడ ఉమామహేశ్వర రావు, మాదు చంటి, బుజ్జి, నొడగల రాంబాబు, దువ్వి వాసు, చెన్నా దాసు, రమణమూర్తి, జ్యోతిర్మయి, మన్యాల సోంబాబు, పోతిన సురేష్, సీరపు వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాలికలను వేధించిన ఆకతాయిలకు దేహశుద్ధి

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు మైలపల్లి వారి కళ్లాల రహదారిపై ఆదివారం ఉదయం ద్విచక్ర వాహనంపై తండ్రితో వెళ్తున్న ఇద్దరు బాలికలను ఆరుగురు ఆకతాయిలు వేధించారు. వెంటనే ఆ తండ్రి ద్విచక్ర వాహనం ఆపగా నలుగురు యువకులు పారిపోయారు. మిగిలిన ఇద్దరినీ స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేశారు. అనంతరం ఆ యువకుల కుటుంబ సభ్యులు వచ్చి బాధితులతో మాట్లాడి విడిపించుకుపోయారు. మరోమారు ఇలాంటి సంఘటనలు జరిగితే పోలీసులకు ఫిర్యాదు చేస్తామని బాధిత కుటుంబ సభ్యులు హెచ్చరించారు.

హోమియో మందుల పంపిణీ


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

భీమునిపట్నం: స్థానిక కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చైర్మన్ కలిగొట్ల శ్రీరామచంద్ర మూర్తి పర్యవేక్షణలో ఉచిత హోమియో వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. వైద్యులు టి.జగన్నాథరావు, టి.జె.మోహన్ 95 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందించారు. ఫౌండేషన్ సభ్యులు కె.ఎస్.ఎన్.మూర్తి, కె.చంద్రశేఖరావు, కె.భానోజీరావు, కె.శ్రీనివాసరావు, వి.లక్ష్మణరావు, ఎం.శంకర్, రాంబాబు, వి.తాతాజీ పాల్గొన్నారు.

నేడు 'సురక్ష' శిబిరం

తగరపువలస: భీమిలి మండలం దాకమర్రిలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించనున్నామని సర్పంచ్ చెల్లూరి పైడప్పడు తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విలేజ్ హెల్త్ క్లినిక్ వద్ద నిర్వహించే శిబిరంలో పంచాయతీ ప్రజలు వైద్య సేవలు పొందాలని ఆయన సూచించారు.

కిటకిటలాడిన పొట్టేళ్ల సంత


తగరపువలస సంతలో విక్రయానికి కొమ్ములు తిరిగిన పొట్టేళ్లు


విక్రయానికి తీసుకొచ్చిన నాటుకోళ్లు

తగరపువలస: విజయ దశమి రోజున పరిశ్రమల్లో జరిపే ఆయుధ పూజకు పొట్టేళ్లు, మేకలను బలివ్వడం ఆనవాయితీ. అందుకోసం ఉత్తరాంధ్రలో వివిధ ప్రదేశాలకు చెందిన ఉద్యోగులు, కార్మికులు, ముఠా పనివారు కొమ్ములు తిరిగిన పొట్టేళ్లు, మేకల కోసం సంతలన్నీ గాలిస్తుంటారు. అలాంటి సంతల్లో విజయ దశమికి ముందు వచ్చే తగరపువలసలో ఆదివారం జరిగే సంత పొట్టేళ్లు, మేకలకు ఫేమస్. ఈ సంతకు భీమిలి డివిజన్‌లో వ్యాపారులు, రైతులే కాకుండా విజయనగరం జిల్లా డెంకాడ మండలం బంగారాజుపేట, కొండ్రాజుపేట గ్రామాల నుంచి వందలాది మంది వ్యాపారులు వస్తుంటారు. వీరు ఏడాది పొడవునా తగరపువలస, సవరవిల్లి, రాజాం, బొబ్బిలి, సాలూరు, మానాపురం, పార్వతీపురం, కాశీపట్నం, బుడుమూరు, కందివలస గెడ్డ, కొత్తవలస, కిలారు, గార, గుంటూరు - పల్నాడులో జరిగే బాపట్ల, గుంటూరు, వినుకొండ, త్రిపురాంతకం, తెలంగాణలోని హైదరాబాద్ పట్టణాల సంతలకు వెళ్తుంటారు. అక్కడ కొనుగోలు చేసిన పొట్టేళ్లు, మేకలను బలిష్ఠంగా తయారు చేయడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు. ఏటా విజయ దశమికి నెల రోజుల ముందు నాలుగు వారాల్లో తగరపువలసలో జరిగే సంతలో రూ.2.50 కోట్ల నుంచి రూ.4 కోట్ల వ్యాపారం జరుపుతారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో కిలో మటన్ రూ.900 ఉన్నందున జీవాల లెక్కన కొనుక్కునే వారికి కిలో రూ.1000 నుంచి రూ.1200 వరకు ఉంటుంది. సాధారణ రోజుల్లో చవకగా కూడా లభిస్తాయి.

నాటుకోళ్లకు యమ గిరాకీ...

మటన్ ధరతో సమానంగా నాటుకోళ్లకూ ఇక్కడి సంతలో గిరాకీ ఉంది. సాధారణ రోజుల్లో కిలో రూ.600కు లభించే నాటుకోడి విజయదశమి పుణ్యమా అని కొండెక్కి కూర్చుంది. కిలో నాటుకోడి ఇప్పుడు రూ.వెయ్యికి పైగా పలుకుతోంది. అయితే నాటుకోడి ధరల్లో మూడో వంతు ఉండే గిరిరాజా కోళ్లను ప్రస్తుతం మార్కెట్‌లో నాటుకోళ్లుగా మాయ చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. రుచిలో నాటుకోడికి గిరిరాజా కోళ్లు ఏ మాత్రం సాటి రావని మాంస ప్రియులు అంటున్నారు. అలాగే ఏజెన్సీ ప్రాంతాల్లో పెంచే మేకలు, గొర్రెలలో కూడా 2, 3వ రకాలు ఉంటాయి. వీటికి కండ తక్కువ, దుమ్ములు ఎక్కువగా ఉంటాయి. ఫారం కోళ్లు ఉన్నట్టే ఫారం మేకలు, గొర్రెలు ఉంటాయి. ఇవి నాటు జీవాలతో పోలిస్తే రుచిలో తేడా కనిపిస్తుంది. ఇలాంటివి తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల్లో కనిపిస్తుంటాయి. ఆ ప్రాంతంలో వీటి మాంసం కూడా కిలో రూ.400 నుంచి రూ.500 లోపే ఉంటుంది. కొనుగోలుదారులు గమనించకపోతే మోసపోయే అవకాశం ఉంది.

వెనక్కి తగ్గిన సముద్రం


సముద్రం వెనక్కి తగ్గడంతో కనిపిస్తున్న రాళ్లు

భీమునిపట్నం: భీమిలి తీరంలో ఆదివారం సముద్రం అలలు బాగా వెనక్కి వెళ్లడంతో సందర్శకులు సరదాగా గడిపారు. సాధారణంగా రోజూ ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అలల ఉధృతి ఎక్కువగా ఉంటుంది. దీంతో ఇక్కడకు వచ్చే సందర్శకులు నీటిలోకి దిగేందుకు సాహసించరు. ఒకవేళ ఎవరైనా దిగినా పోలీసులు వెంటనే వెలుపలకు రమ్మని హెచ్చరిస్తారు. అయితే ఆదివారం ఉదయం నుంచి అలలు చాలా వరకు వెనక్కి వెళ్లిపోయాయి. సెలవు రోజు కావడంతో అనేక ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన సందర్శకులు తీరంలో ప్రశాంతంగా సేదతీరారు. అలలు బాగా వెనక్కి వెళ్లడంతో పెద్ద రాళ్లు బయటపడడంతో అనేక మంది వాటిపైకి చేరి ఫొటోలు తీసుకున్నారు.

ఎమ్మెల్యే దృష్టికి రెండో వార్డు సమస్యలు


వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి జీరు వెంకటరెడ్డిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డులో సమస్యల పరిష్కారానికి స్థానిక నాయకులు ఆదివారం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావును నగరంలోని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఇటీవల వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శిగా నియమితులైన జీరు వెంకటరెడ్డిని ఎమ్మెల్యే సత్కరించి పార్టీ కోసం మరింత గట్టిగా పనిచేయాలని సూచించారు. ఎమ్మెల్యేను సీనియర్ నాయకులు చిల్ల బాబ్యురెడ్డి, చిల్ల గణేష్‌రెడ్డి, చిల్ల వెంకటరమణ తదితరులు కలిశారు.

పోటీ పరీక్షల విద్యార్థులకు బోధన

తగరపువలస: సంతపేట అంబేద్కర్ జీవీఎంసీ హైస్కూల్‌లో ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ, మ్యాన్ రెడ్డి ఫిజికల్ ఫిట్‌నెస్ సెంటర్ ఆధ్వర్యంలో పోటీపరీక్షల అభ్యర్థులకు నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ శిబిరాన్ని ఆదివారం మాథ్స్ రాష్ట్ర రీసోర్స్ పర్సన్ బీజే రమణ సందర్శించారు. నగరంలోని దండుబజారు జీవీఎంసీ హైస్కూల్‌లో ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్న ఆయన గణితంలో మెలకువలు బోధించారు. అలాగే భీమిలి పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ నాయుడు కరెంట్ అఫైర్స్ వివరించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు గంటాన మోహన్‌రావు, రేకఅప్పారావు, మాజీ సుబేదార్ మట్టా అప్పలనరసయ్యరెడ్డి, డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ కళాశాల సూపరింటెండెంట్ జీవీ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ డిమాండ్

రహదారిపై మురుగునీటితో అవస్థలు


పీఎం పాలెం క్రికెట్ స్టేడియం పక్కన రహదారిపై నిలిచిన నీరు

తగరపువలస: జీవీఎంసీ మధురవాడ జోన్ 6వ వార్డు పీఎం పాలెం డాక్టర్ వైఎస్సార్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం పక్కన విజయ మెడికల్ సెంటర్ నుంచి సాంకేతిక కళాశాలకు వెళ్లే రహదారిపై నెల రోజులుగా మురుగునీరు నిలిచిపోయింది. వాహనాలు వేగంగా వెళ్తున్న సమయంలో ఆ బురద నీరు పాదచారులపై పడుతోంది. ముఖ్యంగా ల్యాబ్‌కు వచ్చే రోగులు ఇబ్బంది పడుతున్నారు. ఈ ప్రాంతంలో డ్రైనేజీ నిర్మించి మురుగునీరు రహదారిపై లేకుండా చర్యలు తీసుకోవాలి. - బెహరా మహేష్, పీఎం పాలెం

ప్రకృతి సాగుతో మంచి దిగుబడులు

సబ్బవరం: ప్రకృతి వ్యవసాయం సాగుతో ఆరోగ్యవంతమైన పంటల దిగుబడితో పాటు రైతులకు లాభదాయకంగా ఉంటుందని ప్రకృతి సాగు డీపీఎం లచ్చన్న తెలిపారు. మండలంలోని ఆదిరెడ్డిపాలెం,బంగారమ్మపాలెం గ్రామాల్లో ఆధునిక విధానంలో చేపట్టిన ప్రకృతి సాగు మోడల్ ప్లాట్‌లను ఆయన ఆర్‌టీఎల్ ప్రకాష్‌తో కలిసి ఆదివారం పరిశీలించారు. ఏటీఎం పద్ధతిలో కూరగాయలు,ఆకు కూరలు,దుంప జాతి,తీగ జాతి మొదలైన విత్తనాలను 20 సెంట్లలో బెడ్స్(చిన్న చిన్న మళ్లు)లో వేసుకుని సాగు చేస్తే రైతులకు నిరంతరాయంగా ఆదాయం వస్తుందన్నారు. ఈ సందర్భంగా రైతులకు జిల్లేడు కషాయం, ఘన జీవామృతం తయారు చేయడంపై అవగాహన కల్పించారు. సాగు విధానంపై పలు సూచనలు చేశారు. ఆదిరెడ్డి రమణ, ఆడారి రాము,సిబ్బంది వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అధిష్ఠింపజేశారు. 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో అర్చన చేశారు. ఏఈవో భ్రమరాంబ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఘనంగా నిత్య కల్యాణం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం ఘనంగా జరిగింది. జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు.

